క్లుప్తంగా

'మే' ఫ్లవర్ సోయగం



జగన్నాథపురంలోని ఓ ఇంట్లో వికసించిన మే పుష్పాలు

సీతంపేట: లేట్‌గా అయినా లేటెస్ట్‌గా మే ఫ్లవర్ కనువిందు చేసింది. మేలో పూయాల్సిన ఈ పుష్పం జూలైలో వికసించి అందరినీ ఆకర్షిస్తోంది. అక్కయ్యపాలెం జగన్నాథపురంలో నివసిస్తున్న సివిల్ ఇంజినీర్ మేకల కృష్ణమోహన్ ఇంట్లో ఆరు కుండీల్లో వేసిన దుంపల నుంచి ఒక్కసారిగా పూలు పూశాయి. పశ్చిమ గోదావరి నుంచి చాలా ఏళ్ల కిందట దుంపలు తెచ్చి నాటామని, ప్రతి ఏటా మే నెలలోనే పూస్తున్నా.. ఈ ఏడాది ఆలస్యంగా పూలు పూసాయని, చాలా ఆనందంగా ఉందని కృష్ణమోహన్ తెలిపారు.

కొండవాలులో అభివృద్ధి పనులు



శ్రీనివాసనగర్‌లో నిర్మిస్తున్న రహదారి

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. శ్రీనివాసనగర్, నీలకంఠనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం కార్పొరేటర్ గంకల కవిత, జోన్-5 ఇంజినీరింగ్ ఈఈ మత్స్యరాజు పరిశీలించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిలో గొయ్యి పూడ్చివేత



దొండపర్తి రహదారిలో మట్టితో పూడ్చివేసిన గొయ్యి

సాక్షి ఎఫెక్ట్..

తాటిచెట్లపాలెం: పైప్‌లైన్ పనుల నిమిత్తం దొండపర్తి వరుణ్ బజాజ్ షోరూం ఎదురుగా ఇటీవల తవ్వి వదిలేసిన రోడ్డును శనివారం పూడ్చివేశారు. రహదారులను తవ్వి వదిలేయడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'రోడ్లు తవ్వేయడంతో ఇబ్బందులు' అనే శీర్షికన శనివారం 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. తక్షణం స్పందించిన అధికారులు, సిబ్బంది ఈ గోతులను పూరించి, రహదారిని కొంచెం సరిచేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లల్లో వచ్చే వ్యాధులపై అవగాహన

మహారాణిపేట: పిల్లల్లో వచ్చే అంటువ్యాధులను గుర్తించి సత్వర చికిత్స అందించే విధంగా శిక్షణ ఇస్తున్నట్లు రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య (ఆర్‌బీఎస్‌కే) ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్.వి.సమత తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో శనివారం పలు ప్రభుత్వ ఆస్పత్రులు, స్పెషలిస్టు వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, నర్సింగ్ స్టాఫ్‌కు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. డాక్టర్ వి.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలు మూలకు..

- ఫోర్త్ టౌన్, ద్వారకా పీఎస్‌ల ఆవరణలో పేరుకుపోయిన టూ వీలర్లు
- తుప్పుపట్టి పాడైపోయిన వైనం



తుప్పల్లో పడి ఉన్న వాహనాలు



ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్, ద్వారకా జోన్, క్రైం పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో సీజ్‌చేసిన వాహనాలు మూలకు చేరుతున్నాయి. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పోలీస్ స్టేషన్ల ఆవరణలో ఏళ్ల తరబడి కుప్పలుగా ఉంచిన ద్విచక్ర వాహనాలు తుప్పుపట్టి ఎందుకు పనిరాకుండా పోయాయి. కొన్ని వాహనాలు చెల్లాచెదురుగా తుప్పల్లో పడి ఉన్నాయి. ఈ రెండు స్టేషన్ల పరిధిలో పలు కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు స్టేషన్ ఆవరణలోనే పేరుకుపోవడం గమనార్హం. గతంలో ఒక సీపీ మధురవాడలో వాహనాల డిపో ఏర్పాటు చేసి ఇటువంటి వాహనాలను అక్కడికి తరలించే వారు. ప్రస్తుతం ఇక్కడి పోలీసు అధికారులు మాత్రం ఎందుకనో ఈ విషయాన్ని లైట్ తీసుకున్నారు. ఫలితంగా స్టేషన్ ఆవరణలో ఉంచిన వాహనాలు ఎండకు ఎండి, వానకు తడిసి పాడవుతున్నాయని వాటి యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దొంగతనాలు, అక్రమ రవాణా, సరైన రికార్డులు లేకపోవడం తదితర కేసుల్లో సీజ్ అయిన వాహనాలను పోలీస్ స్టేషన్లకు తరలిస్తుంటారు. ఇక్కడికి ఏళ్ల తరబడి వాహనాలు మాత్రమే రావడంతో పోలీస్ స్టేషన్.. పెద్ద షోరూంను తలపిస్తోందని పలువురు విమర్శిస్తున్నారు.

సీపీకి ఏం చెబుతారు..?

నగర కొత్త పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ శుక్రవారం పోలీస్ స్టేషన్లలో తనిఖీలు ప్రారంభించారు.



పాడైన వాహనాలు

స్టేషన్ల పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చారు. ఆయన ఫోర్త్‌టౌన్, ద్వారకా పోలీస్ స్టేషన్ల సందర్శనకు వచ్చి పరిశీలిస్తే.. స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది ఏం సమాధానం చెబుతారో వేచి చూడాలి.

సదరం సర్టిఫికెట్ల కోసం ఇక్కట్లు

- సర్వర్ మొరాయింపుతో ప్రదక్షిణలు చేస్తున్న దివ్యాంగులు

మద్దిపాలెం: సదరం సర్టిఫికెట్ కోసం స్లాట్లు బుక్ చేసుకోవడానికి దివ్యాంగులు ఇక్కట్లు పడుతున్నారు. సర్వర్ మొరాయించడంతోపాటు ఆయా సచివాలయాల ఎడ్యుకేషన్ కార్యదర్శులు సమయ పాలన పాటించపోవడంతో సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జీవీఎంసీ 53వ వార్డులోని ఓ సచివాలయంలో రెండు రోజులుగా సర్వర్ మొరాయిస్తోంది. మేడపైన ఉన్న ఈ సచివాలయంలోకి వెళ్లేందుకు పైకి ఎక్కలేక దివ్యాంగులు అవస్థ పడుతున్నారు. సర్టిఫికెట్ కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్నాన్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎడ్యుకేషన్ కార్యదర్శి సమయపాలన పాటించకపోవడంతో తాము గంటల తరబడి సచివాలయంలో నిరీక్షించాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. సర్వర్ సమస్య తొలగిన తర్వాత



53వ వార్డులో ఖాళీగా దర్శనమిస్తున్న సచివాలయం

ఫోన్ ద్వారా సమాచారం అందించినా బాగుంటుందని పలువురు కోరుతున్నారు. అలాకాకుండా రోజూ కార్యాలయానికి రావాలని వారు సూచిస్తున్నారని, తద్వారా తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలియజేశారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని సర్టిఫికెట్లు జారీ చేయాలని దివ్యాంగులు కోరుతున్నారు.

లలితా పీఠంలో వారాహి నవరాత్రులు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతంపేట: లలితా నగర్ లలితా పీఠంలో వారాహి నవరాత్రులు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆషాడ శుద్ధ పాడ్యమి నుంచి శుద్ధ నవమి వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా శనివారం సాయంత్రం వారాహిదేవికి సహస్ర నామార్చన చేశారు. అమ్మవారిని అలంకరించి దూప దీప నైవేద్యం సమర్పించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ వారాహిదేవిని పూజించడం వల్ల కష్టాల నుంచి ఉపశమనం, మానసిక సమస్యల నుంచి విముక్తి, ఆరోగ్యం చేకూరుతాయన్నారు. ఈ నెల 10న శుద్ధ పంచమి సందర్భంగా బుధవారం సాయంత్రం 7 గంటలకు వారాహి హోమం నిర్వహిస్తామని, పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



అలంకరణలో వారాహి దేవి

బోధనలో నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

విద్యా శాఖ ఆర్జేడీ విజయ భాస్కర్

విశాఖ విద్య: బోధనలో నైపుణ్యాలు మెరుగుపర్చుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చదువులు చెప్పాలని విద్యాశాఖ ఆర్జేడీ బి. విజయ భాస్కర్ అన్నారు. గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జిల్లాలోని గణితం బోధించే ఉపాధ్యాయులకు శనివారం వృత్తి నైపుణ్య శిక్షణ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జేడీ విజయ భాస్కర్ మాట్లాడుతూ గణతం అంటే విద్యార్థుల్లో లేనిపోని భయం ఉందని, ఇదో కష్టమైన సబ్జెక్టుగా భావిస్తున్నారన్నారు. కానీ సబ్జెక్టులో పట్టుసాధిస్తే,గణితమే సులభమన్నారు. దీనిలోనే ఎక్కువ మార్కులు కూడా సాధించవచ్చన్నారు. సబ్జెక్టుపై పట్టుసాధించి బోధనలో మెలకువలను తెలుసుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. డీఈవో ఎల్. చంద్రకళ మాట్లాడుతూ సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులను ముందుగా గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సంవత్సరం పదో తరగతి వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రతీ ఉపాధ్యాయుడు శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ గణిత పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థుల తరపున ఆయా పాఠశాలల గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం వై. వేణుగోపాల్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయ భాస్కర్

వైభవుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణలో అర్చకులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్రమశిక్షణతో సేవా కార్యక్రమాలు



వాకర్స్ క్లబ్ సభ్యులకు జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న కమల్ బైద్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి విస్తృత సేవా కార్యక్రమాల ద్వారా ఆదర్శంగా నిలుస్తున్నారని వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో కమల్ బైద్ ప్రశంసించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన శనివారం వాకర్స్ పార్కులో క్లబ్ నెలవారీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడూతూ వాకర్స్ ఇంటర్నేషనల్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో ఈ క్లబ్ ముందంజలో ఉందన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ వాయిస్ జూలై నెల సంచికను ఆయన ఆవిష్కరించారు. 91వ వసంతంలోకి అడుగు పెట్టిన క్లబ్ పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య, ఈ ఏడాది 90వ వసంతంలోకి అడుగు పెడుతున్న పూర్వ అధ్యక్షులు కేజీ కృష్ణారావు, రాళ్లపల్లి సత్యనాథం చేసిన సేవా కార్యక్రమాలను సభ్యులకు పల్లా చంద్రమౌళి తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సొంత భవన నిర్మాణానికి తొలిసారిగా వాకర్స్ క్లబ్ సభ్యుల తరపున లక్ష రూపాయల విరాళాన్ని అందించినట్లు చెప్పారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం నూతన సభ్యులకు వాకర్స్ నియమావళి తెలియచేసి ప్రమాణ స్వీకారం చేయించారు. కమల్ బైద్‌ను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జ్యూట్ బ్యాగ్‌లు సభ్యులకు పంపిణీ చేశారు. వాకర్స్ డిస్ట్రిక్ట్-101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, క్లబ్ కార్యదర్శి పి.చెల్వారాజు, కోశాధికారి జె.కూర్మారావు, పూర్వాధ్యక్షులు సిహెచ్.కృష్ణమూర్తి, ఎం.భాస్కరరావు, సత్తి సునీల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు జి.విజయలక్ష్మి, వి.అప్పారావు, ఆర్.నాగేశ్వరరావు, వై.దేముడు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఎస్.రామ్మోహనరావు, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితా రెడ్డి, ఓం వాకర్స్ అధ్యక్షురాలు వి.ప్రమీల పాల్గొన్నారు.

జీఆర్పీ అదుపులో పాత ముద్దాయి



జీఆర్పీ సిబ్బంది అదుపులోకి తీసుకున్న గంజాయి నిందితుడు

తాటిచెట్లపాలెం: పాత గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న ముద్దాయిని శనివారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఉన్నతాధికారుల ఆదేశాలతో విశాఖ రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫాంలలో రైల్వే పోలీసులు ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. పాత గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న కోరాపుట్‌కు చెందిన కండరపు గిరీష్‌ప్రతాప్ రెడ్డిని అదుపులోకి తీసుకుని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు. తనిఖీల్లో జీఆర్పీ సిబ్బంది, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం పేద విద్యార్థులకు పుస్తకాల వితరణ

తాటిచెట్లపాలెం: ముస్లిం వెల్ఫేర్ సొసైటీ(విశాఖపట్నం) ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ముస్లిం పేద విద్యార్థులకు పుస్తకాలు వితరణ చేశారు. టీఎస్ఎన్ కాలనీలోని సింకా గ్రాండ్ హోటల్‌లో విద్యార్థులకు పుస్తకాలతో కూడిన కిట్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు హైదర్ ఆలీ సింకా మాట్లాడుతూ తమ సొసైటీ తరపున నిత్యం సామాజిక సేవలను తమ సామాజిక వర్గానికి చెందిన పేదలకు అందజేస్తున్నామన్నారు. ఉచిత వివాహ పరిచయ వేదికలు, వివాహాలు, సున్తీ కార్యక్రమాలు వంటివి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 5వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న ముస్లిం పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, కాంపాస్ బాక్స్‌లతో కూడిన కిట్‌లు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, ప్రతినిధులు మిర్ అబ్బాస్ హుస్సేన్, సయ్యద్ అమీర్ జాన్, హమబూబ్ ఆలీ ఖాన్, షేక్ అహ్మద్‌వలీ, షేక్ అబ్దుల్‌మునీర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ నజీర్‌లు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాల కిట్లు అందజేస్తున్న ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి



కప్పరాడలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్



బీజేపీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న శ్యామలా దీపిక, రాకేష్

కంచరపాలెం: దళితుల అభ్యున్నతికి సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ చేసిన కృషి అభినందనీయమని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నారు. 46, 47 వార్డుల్లోని కస్తూరినగర్, కప్పరాడ ప్రాంతాల్లో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి యువత జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. ఆయా ప్రాంతాల్లోని జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శోభన్‌బాబు, సుకుమార్, కనకరాజు, కె.చిన్నారావు, బుల్లిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, దళిత నాయకులు పాల్గొన్నారు.

బాబూజీ సేవలు మరువలేనివి

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలా దీపిక, జిల్లా ఎస్సీ మోర్చా నాయకుడు గంధ్రెడ్డి రాకేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబూజీ జగ్జీవన్ రామ్ అందించిన సేవలు మరువలేనివన్నారు. జాన్, రాకేష్, శ్రీను, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

లా విద్యార్థులకు కొత్త చట్టాలపై అవగాహన

సీతమ్మధార: ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని క్రైం ఏసీపీ వెంకటరావు సూచించారు. సీతమ్మధార టీపీటీ కాలనీలోని ఎన్‌బీఎం లా కళాశాలలో విద్యార్థులకు శనివారం పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి మారిన సెక్షన్ల గురించి వివరించారు. భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక సురక్ష సంహిత(బీఎన్, ఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అభినయం, బాధితుల హక్కుల పరిరక్షణకు చేర్చబడిన కొత్త చట్టాలపై వివరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, చైన్ స్నేచింగ్, మొబైల్ దొంగతనాలు, వాహనాల చోరీలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపాల్ పి.వి.రమణ, ఎస్.రాజు, ఫోర్త్ టౌన్ క్రైం ఎస్ఐ భాస్కరరావు, ఎస్.రాజు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న క్రైం ఏసీపీ వెంకటరావు

విజేతలు విజయనగరం, హనీ గ్రూప్



ఇన్‌స్టిట్యూషనల్ విజేత హనీ గ్రూప్ జట్టు



డివిజన్ లీగ్ విజేత విజయనగరం జట్టు

విశాఖ స్పోర్ట్స్ : విశాఖ జిల్లా క్రికెట్ సంఘం వార్షిక డివిజన్ లీగ్ పోటీల్లో విజయనగరం, గెలాక్సీ జట్లతో పాటు డివిజన్ల, ఇన్‌స్టిట్యూషన్ లీగ్ విజేతలు ట్రోఫీలందుకున్నారు. శనివారం నిర్వహించిన వార్షిక బహుమతి ప్రధానోత్సవంలో తొలి డివిజన్ విజేతగా విజయనగరం జిల్లా జట్టు నిలవగా, రన్నరప్‌గా గెలాక్సీ సీసీ నిలిచింది. రెండో డివిజన్‌లో ఈకోర్సా, కొంటీ సీసీ జట్లు, మూడో డివిజన్‌లో స్టీల్‌ప్లాంట్, సోలోస్ జట్లు, నాలుగో డివిజన్‌లో ఉషోదయ సీసీ, మూన్ స్టార్స్ జట్లు, ఐదో డివిజన్‌లో రైజింగ్ బ్లూస్, యూసీసీ జట్లు, ఆరో డివిజన్‌లో వాల్తేర్ నైట్స్, లెజెండ్స్ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ఇన్‌స్టిట్యూషన్ లీగ్‌లో హనీ గ్రూప్, సిటీ పోలీస్ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. స్థాయి ఆధారంగా ఆరు డివిజన్లుగా పోటీలు నిర్వహించగా తొలి డివిజన్‌లో తపస్వి బెస్ట్ బ్యాట్స్‌మేన్‌గా, మనీష్ బెస్ట్ బౌలర్‌గా, ఎస్వీ రాహుల్ బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచారు. ఈశ్వర్, చరణ్, సుమీత్ రెండో డివిజన్‌లో, యశస్వి, శ్రీనివాస్, సతీష్ మూడో డివిజన్‌లో, రాజు, నాగార్జున, అనిల్‌కుమార్ నాలుగో డివిజన్‌లో బెస్ట్‌గా నిలిచారు. సతీష్, హరీష్, హేమంత్ ఇన్‌స్టిట్యూషనల్ లీగ్‌లో బెస్ట్‌గా నిలిచారు. వైఎస్ఆర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వీడీసీఏ ఉపాధ్యక్షుడు డీఎస్ వర్మ, కార్యదర్శి పార్థసారథి బహుమతి ప్రధానం చేయగా సంఘం ప్రతినిధులు సుధాకర్, టీఎస్ఆర్ ప్రసాద్, ఎస్ఎస్ ప్రసాద్, జేకేఎం రాజు, సీపీ రెడ్డి పాల్గొన్నారు.

సహకారంతోనే మనిషి మనుగడ

విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని



పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

సీతమ్మధార: సహకారం లేనిదే మనిషి మనుగడ సాగదని విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆయన పతాకాన్ని ఆవిష్కరించారు. సహకార దృక్పథంతోనే వ్యవస్థలు అభివృద్ధి చెందుతాయన్నారు. వస్తుమార్పిడి ద్వారా సహకారం అందించుకున్న రోజుల నుంచి మారుతున్న కాలానికి అనుగుణంగా సహకార వ్యవస్థలోనూ మార్పులు వచ్చాయన్నారు. సమాజంలో అంతరాలను తొలగించేందుకు వీలుగా వెనుకబడిన వర్గాలకు బ్యాంకింగ్ సేవలు అందించడమే సహకార బ్యాంకుల ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రపంచ జనాభాలో 12 శాతం మంది పలు సహకార సంస్థలతో అనుబంధం కలిగి ఉన్నారన్నారు. సీనియర్ డైరెక్టర్లు సిరిపూరి రామచంద్రరాజు, జేవీ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.రామకృష్ణ, సీఈవో పి.వి.నరసింహమూర్తి, డిప్యూటీ కార్యదర్శి వి.వి.బి వరలక్ష్మి, జనరల్ మేనేజర్ ఎ.వి.రామకృష్ణారావు పాల్గొన్నారు.